గల్పిక

# భక్తికి మూలం - మూల్యం

" జ్యేష్ఠ "

"ఇన్నాళ్లుగా జీవితాన్ని మథిస్తున్నాను. ఆ మథనంలో ప్రభవించిన మహానలాన్ని కాలకూటాన్ని ప్రజలే భరిస్తున్నారు. అమృతం నాది." ఈ వింత ఆలోచన అతనిమనోవల్మీకంలో బుసలు కొడుతోంది. "ఏనాడైనా ఉపకారం చేశానా! ఎవరికైనా? క్రిందటి జన్మలోకూడా చేసి ఉండను. చేస్తే ఈ బాధే ఉండకపోను." అతను నీరసంగా నవ్వుకున్నాడు. నేను సంఘానికి చీడ పురుగునా? నా హోటలు, వ్యాపారం ప్రజల నెత్తురు పీల్చే జలగలా? ఈ మాటకు ఓ బికారి సమాధాన మిచ్చాడు అడక్కుండానే "ముమ్మాటికీని" అన్నాడు. అతనికి బికారిమీద కోపం రాలేదు; కొద్దిగా ఒణికాడు అంతే.

అతను ఏభయ్యోపడిలో పడ్డాడు. ఏభైలక్షలార్జించాడు. అన్ని సుఖాలూ అనుభవించాడు. కానీ ఏనాడు ఆనందం ఎరగడు. గదిలో చీకటి భయం కలిగిస్తోంది. స్విచ్ 'ఆన్' చేశాడు.

ఇనప్పెట్టి తళతళ లాడుతోంది. దానికి సూర్యకాంతి స్పర్శలేదు. దానిలో బరువు పెరగటమే కాని తగ్గటంలేదు. అద్దంలా మెరుస్తోంది దాని తలం. ఎదురుగా గోడమీద ధనదేవత చిత్రపటం. అగరువత్తి ధూమం సాంబ్రాణి ధూపం,యజమాని ఎదలో దుమారం. వీధిలో ఏదో కలకలం. దూరంగా కడలి అలల గంభీర గర్జన. కాని ఆ గదిలో సర్వం నిశ్శబ్దం; స్తబ్ధం.

అతను వీధిలోకి తొంగిచూశాడు. చీకటి పడుతోంది. తన జీవితంలో కూడా సాయంత్రం తొంగి చూస్తోంది. తన తెల్లజుట్టుని చూసి నవ్వుతోందా ఇనప్పెట్టి? లేకపోతే ఏమని నవ్వుతోంది. నవ్వకపోతే ఏంచేస్తోంది? ఏమంటోంది?

"నా శరీరంలోని యినుమే ఆ యింటికి పునాది తవ్వుతున్న కూలీచేతిలోనిది.ఆ పార సూర్యకాంతికి కరువ్వాచిపోలేదు. అది వాడికి జీవనోపాధి కలిగిస్తోంది. వాడి నిష్కల్మషమైన ప్రేమ పొందుతోంది.ఇల్లు నిర్మించటానికి పునాదులు తవ్వుతుంది. ప్రకృతితో పోరాడుతుంది. దానికి జీవం, రావం, ఉత్సాహం, వేగం, గమనం సర్వం ఉన్నాయి. నాకేమున్నాయి? కదలిక లేదు. కదలికే ప్రాణమంటారు. కాంతిలేదు. కాంతే జీవమంటారు. నన్ను నీ పాపాలకు ప్రతిబింబం, ప్రతినిధీ చేశావు. నీ దాస్యంలో నేను పాలిపోయాను. ఏనాడో నాకూ విముక్తి కలుగుతుందిలే. నువ్వే చూస్తావేమో!" అంటోందా?

"ఇనప్పెట్టెకు విముక్తా!" అతని గుండె జల్లుమంది. "దీంట్లో నా పాపాలే కాదు ప్రాణాలు కూడా ఉన్నాయి" అతను గొణిగాడు కుర్చీలో కూలపడుతూ. అతని ముఖంపై చెమట సాక్షాత్కరించింది. ఎదురుగా, గోడమీద బ్రహ్మకపాలంతో తాండవమాడుతున్న శివుని ప్రళయరూపం 'అబ్బా' అతను మొత్తుకున్నాడు ... భజన మందిరంలో గంటలు గణగణమన్నాయి...పూజారీ, ఆరుగురు వృద్ధులూ చలివల్ల ఒణుకుతూ పాడుతున్నారు. "శంకర! పాప...భయంకర...దేవర."

ఈ భజనమందిరం అతనే కట్టించాడు తన పాపాలు జీర్ణించుకోటానికి. ఎవరైనా అక్కడికి వచ్చి భగవద్గానం చేయవచ్చు. ఇది అతనికి కొద్ది ఉపశాంతినిస్తోంది.

అతను చిన్నచిన్న అడుగులతో పూజా మందిరంలో అడుగెట్టాడు. గౌరవసూచకంగా భజన ఆపేరు భక్తులు. అతనన్నాడు: "ఇదేం! ఆరుగురే వచ్చారేం?"

"చిత్తం. చిన్నబాబుగారు ఈ గదిలో అడుగెట్టేవాళ్ళకి అణాఅణా టిక్కట్టెట్టారండి-ఇదిగో ఆరణాలు."

అతను గావుకేకలెట్టాడు. "దేవా! చావు నియ్యవా" ... కేకలకు పూజారి ఒణికాడు. పూజారి చేతిలోని ఆరణాలు దీపపు సెమ్మాలో పడ్డాయి. దీపం టక్కున ఆరిపోయింది...